నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మోతీనగర్: విద్యుత్ మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏఈ ఎస్. రాకేష్‌కుమార్ గౌడ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 11 కెవి హ్యుందయ్ 2 ఫీడర్ పరిధిలో ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మెరిడియన్ స్కూల్ ప్రాంతం, కన్వెన్షన్ లైన్, బుట్ట కన్వెన్షన్ రోడ్డు నుంచి ఎస్‌బిఐ వరకు, సూర్య పేపర్ నుంచి సలీం టీస్టాల్ వరకు, 11కెవి ఎస్‌బీఐ కాలనీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల వరకు ఆర్ఆర్ఆర్ వైన్స్ రోడ్డు, ఎస్‌బీఐ కాలనీ, కైత్లాపూర్ బ్రిడ్జి దగ్గర, చందానాయక్ తండాలోని కొంత భాగం, 11కెవి సాయినగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 8 నుంచి 8.30 వరకు సాయి నగర్ ప్రాంతం, రోడ్డు నంబర్ 52 నుంచి 60, అయ్యప్ప సొసైటీ పార్కు, బోలినే అపార్టుమెంట్‌లు, సిమ్మింగ్‌పూజ్ రోడ్డు ప్రాంతం వరకు విద్యుత్ నిలిపివేయనున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

నాలా విస్తరణ పనులు ప్రారంభించాలి

కార్పొరేటర్ సబిహా బేగం



నాలాను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సబిహా బేగం, అధికారులు

మోతీనగర్: నాలా విస్తరణ పనులను తొందరగా మొదలు పెట్టాలని కార్పొరేటర్ సబిహా బేగం అన్నారు. అల్లాపూర్ డివిజన్ పరిధిలోని సఫ్దార్ నగర్‌లో శుక్రవారం ఎస్ఎన్‌డీపీ అధికారులు డీఈ రాజ్యలక్ష్మి, ఏఈ సాయి శరన్, జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ అధికారులు ఈఈ రమేష్, డీఈ శంకర్, ఏఈ రంజిత్‌లతో కలిసి నాలాలను పరిశీలించారు. కార్యక్రమంలో అబ్దుల్ హమీద్, సయ్యద్‌రియాజ్, అస్లాంబేగ్, మల్లేష్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సెలవు రోజుల్లోనూ.. ప్రజాపాలన కేంద్రాలు



సాక్షి, సిటీబ్యూరో: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి అవకాశాల ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకమైన రాజీవ్ యువ వికాసం పథకం ప్రకటించిందని, సెలవు రోజుల్లో కూడా ప్రజాపాలన కేంద్రాలు పనిచేస్తాయని, ఆఫ్‌లైన్ ద్వారా కూడా దరఖాస్తు చేసుకోవచ్చని మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్(లోకల్ బాడీ) రాధికగుప్తా తెలిపారు. కలెక్టరేట్ నుంచి మున్సిపల్ కమిషనర్లతో ఆమె టెలీకాన్ఫరెన్స్ శుక్రవారం నిర్వహించారు. రాజీవ్ యువ వికాసం పథకాన్ని ఎక్కువ మంది నిరుద్యోగులు ఉపయోగించుకోవాలనే ఉద్దేశ్యంతో ఈ నెల 14 వరకు దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని కల్పించిందని ఆమె అన్నారు. ప్రజాపాలన కేంద్రాల వద్ద ఆన్‌లైన్‌లోనే కాకుండా ఆఫ్‌లైన్‌లో కూడా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. సెలవు రోజుల్లో కూడా ఈ కేంద్రాలు పనిచేస్తాయన్నారు. ఆఫ్‌లైన్‌లో స్వీకరించిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసి జాగ్రత్తగా భద్రపరచాలని సంబంధిత అధికారులను ఆమె ఆదేశించారు. మున్సిపల్, ఎంపీడీవో కార్యాలయ స్థాయిలో ప్రచారం చేసి అధిక సంఖ్యలో దరఖాస్తులు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ సూచించారు. 25 శాతం సింగిల్ ఉమెన్, వితంతువులు, 5 శాతం దివ్యాంగులకు ఈ పథకం ద్వారా లబ్ధి చేకూర్చనున్నట్లు ఆమె పేర్కొన్నారు.

రహదారులపై అడ్డుగోడలను తొలగించిన హైడ్రా

సాక్షి, సిటీబ్యూరో: కుత్బుల్లాపూర్ మండలం సూరారం గ్రామంలో రహదారులకు ఆటంకంగా నిర్మించిన ప్రహరీలను హైడ్రా శుక్రవారం తొలగించింది. ఏపీ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ తెలంగాణ డివిజన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు క్షేత్ర స్థాయిలో పరిశీలించి ఈ మేరకు హైడ్రా చర్యలు తీసుకుంది. ఓ పారిశ్రామిక యూనిట్ పెట్టడానికి ఏపీఎస్ఎఫ్ వద్ద తనకున్న 1.26 ఎకరాల భూమిని చూపించి వర్ల రాజేశ్వర రావు అనే వ్యక్తి 2010 లోన్ తీసుకున్నారు. ఆ లోన్ చెల్లించకపోవడంతో భూమి స్వాధీనానికి వెళ్లిన ఫైనాన్స్ కార్పొరేషన్కు ఆటంకాలు ఎదురయ్యాయి. గతంలో ఆ భూమికి చూపించిన మార్గాలను మూసేయడంతో ఆ సంస్థ హైడ్రాను ఆశ్రయించింది. దారులకు అడ్డగా నిర్మించిన ప్రహరీని హైడ్రా కూల్చివేయడంతో మార్గం లభించింది.



మాజీ ఎంపీ సర్వే సత్యనారాయణకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న కాంగ్రెస్ నియోజకవర్గ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి, నాయకులు – కూకట్‌పల్లి

వైభవంగా వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

పూజలు నిర్వహించిన పీఏసీ చైర్మన్ గాంధీ



బ్రహ్మోత్సవాలకు హాజరైన భక్తులు





పూజలు నిర్వహిస్తున్న పీఏసీ చైర్మన్ గాంధీ, కార్పొరేటర్ శ్రీకాంత్

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్‌లోని శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానంలో జరిగిన శ్రీమదలర్మేల్ మంగా పద్మావతీ సమేత శ్రీవేంకటేశ్వర స్వామి వార్ల 34వ వార్షిక బ్రహ్మోత్సవం వైభవంగా జరిగింది. పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి శుక్రవారం ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గాంధీ మాట్లాడుతూ.. బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించుకోవటం సంతోషంగా ఉందన్నారు. స్వామివారి కృపా కటాక్షాలతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని వేడుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రాజేశ్వరరావు, దేవినేని ప్రసాద్, నాని, సంజీవరెడ్డి, నాయినేని చంద్రకాంత్ రావు, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, ప్రసాద్, కృష్ణంరాజు, మల్లయ్య, అల్లం మహేష్, హరికృష్ణ, భక్తులు పాల్గొన్నారు.

రేపు సీతారామచంద్ర స్వామి కల్యాణ మహోత్సవం

మోతీనగర్: మూసాపేట, అల్లాపూర్ డివిజన్‌లలో ఆదివారం శ్రీసీతారామ కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించటానికి ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. పీఆర్ నగర్‌లోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో ఉదయం 10 గంటలకు పునర్వసు నక్షత్రయుక్త అభిజిత్ లగ్న పుష్కరాంశ సుమూహుర్తంలో శ్రీరామచంద్రమూర్తికి, సీతాదేవికి కల్యాణం నిర్వహించనున్నారు. గాయత్రి నగర్ సంక్షేమ సంఘం, ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గాంధీ విగ్రహం వద్ద శ్రీసీతారామచంద్రస్వామి కల్యాణాన్ని ఉదయం 10.35 గంటలకు నిర్వహించనున్నారు. మధ్యాహ్నం ఒంటి గంటకు అన్న సమారాధన, సాయంత్రం 5 గంటలకు స్వామి, అమ్మవార్ల రథోత్సవాన్ని పురవీధుల్లో నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. పర్వతవర్ధిని సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీరామనవమి వేడుకలు ఆదివారం ఉదయం 9.30 గంటలకు మహా వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. సాయంత్రం 7 గంటలకు శ్రీ సీతారాముల వారికి తులసి అర్చన, రామ భజన, పల్లకీ సేవ, ఊరేగింపు, హారతి, తీర్థప్రసాద వితరణ ఉంటుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు. అవంతి నగర్ తోట దేవాలయ ప్రాంగణంలో ఆదివారం ఉదయం 11.37 గంటలకు శ్రీసీతారమచంద్రస్వామి కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు కాలనీ సంక్షేమ సంఘం, దేవాలయ కమిటీ సభ్యులు ఓ ప్రకటనలో తెలిపారు. భక్తులు పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కాగలరని కోరారు.

సీతారాముల కల్యాణానికి హాజరవ్వాలని స్పీకర్‌కు ఆహ్వానం

ఓల్డ్ బోయిన్‌పల్లి: అంజయ్యనగర్‌లోని శ్రీ వీర అభయాంజనేయ స్వామి ఆలయంలో శ్రీరామ నవమి సందర్భంగా నిర్వహిస్తున్న సీతారాముల కల్యాణ మహోత్సవానికి హాజరు కావాలని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. శుక్రవారం ఆలయ ఫౌండర్, ట్రస్టీ గోపాల్ ముదిరాజు ఆధ్వర్యంలో స్పీకర్ నివాసంలో ఆలయ నిర్వాహకులు బాలన్న, మహేష్, అరుణ్, ఇంద్రప్రసాద్ వర్మతో స్పీకర్‌కు ఆహ్వానం అందజేశారు.

ఎమ్మెల్యేకు ఆహ్వానం అందజేత

ఓల్డ్ బోయిన్‌పల్లి: శ్రీరామ నవమి సందర్భంగా హస్మత్‌పేట ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం, అంజయ్యనగర్‌లో జరిగే శ్రీరాముని కల్యాణ మహోత్సవానికి హాజరు కావాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును నిర్వాహకులు ఆహ్వానించారు.



ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు ఆహ్వానం అందజేస్తున్న నిర్వాహకులు

శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆలయ నిర్వాహకులు శేఖర్‌గౌడ్, మక్కాల సత్యనారాయణ, బాల్‌రాజు, నాగేష్ ముదిరాజు ఎమ్మెల్యేను ఆహ్వానం అందజేశారు. అనంతరం కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్‌ను ఆహ్వానించారు.

హర్ష టయోటా మెగా కార్నివాల్ సేల్స్



మెగా కార్నివాల్ సేల్స్‌ను ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకుడు గాదె శివ చౌదరి, సంస్థ ప్రతినిధులు

కూకట్‌పల్లి: ప్రగతినగర్‌లో శుక్రవారం హర్ష టయోటా మెగా కార్నివాల్ సేల్స్‌ను కాంగ్రెస్ నియోజకవర్గ నాయకుడు గాదె శివ చౌదరి, హర్ష టయోటా వైస్ ప్రెసిడెంట్ స్వామి, ఆంధ్ర, తెలంగాణ టయోటా న్యూ కార్స్ హెడ్ ప్రశాంత్, మార్కెటింగ్ హెడ్ సుమంత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ.. మార్కెట్‌లో టయోటా బ్రాండ్ కస్టమర్ల మన్ననలు పొంది ఉందన్నారు. ఈ కార్లు కొనుగోలు చేయటం వల్ల కస్టమర్ పెట్టిన ప్రతి రూపాయి తిరిగి కారు అమ్ముకునేటప్పుడు పొందే అవకాశం ఉంటుందన్నారు. ఆదివారం వరకు మల్టీ బ్రాండెడ్ యూజ్డ్ (వాడిన) కార్లు అందుబాటులో ఉంటాయన్నారు. మూడు రోజుల పాటు ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు సందర్శకులకు అనుమతిస్తామని తెలిపారు. ఈ సమయంలో వాహనం బుక్ చేసుకున్న వారికి ఒక గ్రాము బంగారు కాయిన్ గెలుచుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు గోవింద్ గౌడ్, రమణ, చందు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి కల్యాణం

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్‌లోని వేంకటేశ్వర ఆలయంలో శ్రీవారి కల్యాణాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డేపల్లి రాజేశ్వర రావు, యామిని దంపతులు శ్రీవారి శాంతి కల్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



బాలానగర్: ఫతేనగర్ డివిజన్‌కు చెందిన జి. అరుణకు రూ.లక్ష ఎల్‌వోసీ మంజూరైంది. ఎల్‌వోసీని ఆమె తనయుడు మానేందర్ గౌడ్‌కు కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్ శుక్రవారం బాలానగర్‌లోని పార్టీ కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో నాయకులు నాగిరెడ్డి, తూము వేణు, పుష్పారెడ్డి, లక్ష్మయ్య, దండుగుల యాదగిరి, రాఘవేందర్, కుక్కల రమేష్, యుగేందర్, మధుగౌడ్, మేకల రమేష్, మల్లికార్జున్ యాదవ్, మస్తాన్‌రెడ్డి, ఆయాజ్, ప్రసన్న కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఫార్మసీ కళాశాల విస్తరణకు 15 ఎకరాలు కేటాయింపు

కేపీహెచ్‌బీకాలనీ: జేఎన్‌టీయూ హైదరాబాద్ ఆధ్వర్యంలో సుల్తాన్‌పూర్‌లో నడుస్తున్న యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ విస్తరణ నిమిత్తం 15 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించారు. సంగారెడ్డి జిల్లా ఆందోల్ మండలం, ఆందోల్ గ్రామంలోని సర్వే నంబర్1141/పిలో ఖాళీగా ఉన్న 15 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించేందుకు జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు అనుమతి మంజూరు చేశారు. శుక్రవారం ఆందోల్ –జోగిపేట్ రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ పండు సంబంధిత భూపత్రాలను జేఎన్‌టీయూహెచ్ ఉప కులపతి డా. టి. కిషన్ కుమార్ రెడ్డికి అందజేశారు. సుల్తాన్‌పూర్ ఫార్మసీ కళాశాలకు భూ కేటాయింపునకు సహకరించిన వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు, రాష్ట్ర ప్రభుత్వానికి వీసీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో విశ్వ విద్యాలయం చీఫ్ ఇంజినీర్ ప్రొఫెసర్ ఎస్. శ్రీనివాసులు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి. చంద్రశేఖర్, సుల్తాన్‌పూర్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎం. సునీతారెడ్డి పాల్గొన్నారు.



భూ పత్రాలను కిషన్ కుమార్ రెడ్డికి అందజేస్తున్న రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ పండు తదితరులు

కాలనీ సమస్యలను పరిష్కరిస్తాం

కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్

బాలానగర్: ఫతేనగర్ డివిజన్ పరిధిలోని నాగార్జున కాలనీ సమస్యలను పరిష్కరిస్తామని కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ అన్నారు. శుక్రవారం జలమండలి మేనేజర్ అనిల్‌గౌడ్, జీహెచ్ఎంసీ ఏఈ రాధాకృష్ణతో కలిసి పర్యటించారు. కాలనీలో మంచినీరు లో ప్రెషర్, కొన్ని ఇళ్లల్లో మురుగునీరు సరఫరా అవుతోందని స్థానికులు వారి దృష్టికి తెచ్చారు. సమస్యను వారం రోజుల్లో పరిష్కరించాలని కార్పొరేటర్ అధికారులను ఆదేశించారు. అవసరమైన చోట రోడ్లు వేయిస్తామన్నారు. కార్యక్రమంలో నసీర్, సలాఉద్దీన్, రెహన్‌ఖాన్, బషీర్, ఖలీం, అస్లాం గౌస్, జగన్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో కలిసి సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ సతీష్ గౌడ్

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌ల పంపిణీ

కూకట్‌పల్లి: మధుకర్ స్మారక సేవా సమితి ఆధ్వర్యంలో కేపీహెచ్‌బీ కాలనీలోని భువన విజయం ప్రాథమిక పాఠశాలలో సర్వ పవన్ సమక్షంలో బీజేపీ కూకట్‌పల్లి ఇన్‌చార్జి మాధవరం కాంతారావు, జిల్లా అధికార ప్రతినిధి తోట రమేష్ శుక్రవారం విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లను అందజేశారు. విద్యార్థులు బాగా చదివి మంచి ఫలితాలను సాధించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవీంద్ర, విఠల్, నాయకులు రేవతి, శ్రీనివాస్ రెడ్డి, వినోద్, గోపి, సూరిబాబు, వెంకటరమణ, జగదీష్, గుడిమెట్ల సాయి, జగన్, తోట ప్రశాంత్ పాల్గొన్నారు.

భవిష్యత్ తరమంతా కృత్రిమ మేధస్సుదే

- జేఎన్‌టీయూ మాజీ వైస్–చాన్స్‌లర్ ప్రొ.డీ.ఎన్.రెడ్డి
- గోకరాజు లైలావతి ఇంజినీరింగ్ కళాశాల వేదికగా వార్షికోత్సవం



బహుమతి అందజేస్తున్న అతిథులు

సాక్షి, సిటీబ్యూరో: నేటి ఆధునిక ప్రపంచంలో కృత్రిమ మేధస్సు (ఏఐ), మెషిన్ లెర్నింగ్ పైన అవగాహన పెంచుకోవడం తప్పనిసరి అని, భవిష్యత్‌ను నడిపించేది ఈ వినూత్న ఆవిష్కరణలేనని జేఎన్‌టీయూ హైదరాబాద్ మాజీ వైస్–చాన్స్‌లర్ ప్రొ.డీ.ఎన్.రెడ్డి తెలిపారు. నగరంలోని గోకరాజు లైలావతి ఇంజినీరింగ్ కళాశాల 4వ వార్షిక వేడుకలను శుక్రవారం బాచుపల్లిలోని జీఎల్ఈసీ క్యాంపస్ వేదికగా ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రొ.డీ.ఎన్.రెడ్డి హాజరై విద్యార్థులకు అధునాతన సాంకేతిక, భవిష్యత్ ప్రణాళికలపై అంశాల గురించి వివరించారు. కార్యక్రమంలో భాగంగా విద్యా, క్రీడల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబర్చిన విద్యార్థులను అభినందించి సర్టిఫికెట్లను అందజేశారు. అనంతరంవిద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జీఆర్ఐఈటీ డైరెక్టర్ డాక్టర్ జంధ్యాల నారాయణ మూర్తి, జీఎల్ఈసీ ప్రిన్సిపాల్ డా.ఏ.సాయి హనుమాన్, డా.కేవీఎస్, రిజిస్ట్రార్ రాజు, ప్రొ.పద్మాలయ నాయక్, డాక్టర్ జె. కిషోర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

సీబీఐ మాజీ డైరెక్టర్ విజయ రామారావు జయంతి



చిన్నారులతో కలిసి కేక్ కట్ చేస్తున్న మాజీ కార్పొరేటర్‌లు సదాశివ యాదవ్, కిలారి మనోహర్ తదితరులు

మోతీనగర్: నేటి యువత దివంగత, ఉమ్మడి రాష్ట్ర మాజీ మంత్రి, సీబీఐ మాజీ డైరెక్టర్ కాకులమర్రి విజయ రామారావును ఆదర్శంగా తీసుకోవాలని ఎర్రగడ్డ, వెంగళరావు నగర్ మాజీ కార్పొరేటర్‌లు కంచర్ల సదాశివ యాదవ్, కిలారి మనోహర్ అన్నారు. శుక్రవారం మూసాపేట డివిజన్, బబ్బుగూడలో గణమాస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అనాథ ఆశ్రమంలో విజయ రామారావు 88వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. చిన్నారుల మధ్య కేక్ కట్‌చేసి చిన్నారులకు పండ్లు, మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాజ్‌కుమార్‌గౌడ్, షర్మిల జాదవ్, ఆశ్రమ నిర్వాహకులు ఎం. కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

నిలిచిన వరద.. రాకపోకలకు వ్యథ!



హస్మత్‌పేట చెరువు కట్ట ప్రధాన రహదారిలో నిలిచిన వరద నీరు

ఓల్డ్ బోయిన్‌పల్లి: నగరంలో కురిసిన అకాల వర్షంతో రోడ్లు జలమయం అయ్యాయి. ఇళ్లలోకి కూడా చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. శుక్రవారం కూడా రోడ్లపై నిలిచిన నీటితో చిన్నపాటి చెరువులను తలపిస్తుండటంతో వాహనదారుల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. కొన్ని ప్రాంతాలలో జీహెచ్ఎంసీ సిబ్బంది వరదనీటి కాలువలలో పేరుకుపోయిన చెత్త చెదారాన్ని తొలగించి సాఫీగా వెళ్లేందుకు శ్రమ పడ్డారు. వరద నీటి కాలువలు లేని ప్రాంతాలలో నిలిచిన నీటిని తొలగించేందుకు దారి లేకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. హస్మత్‌పేట బోయిన్‌చెరువు రోడ్డులో నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగించే ప్రధాన రహదారిలో వర్షపు నీరు నిలిచింది. అధికారులు స్పందించి తక్షణమే రోడ్డుపై నిలిచిన వర్షపు నీటిని తొలగించి, రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని వాహనదారులు కోరుతున్నారు.

వారాహి సిల్క్స్‌ను ప్రారంభించిన హీరో బాలకృష్ణ, హీరోయిన్ మీనాక్షి చౌదరి



వారాహి సిల్క్స్‌ను ప్రారంభిస్తున్న బాలకృష్ణ, మీనాక్షి చౌదరి, డైరెక్టర్లు మణిదీప్ ఏచూరి, స్పందన

చూసేందుకు తరలివచ్చిన అభిమానులు

కూకట్‌పల్లి: తెలుగు సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిబింబిస్తూ వస్త్రాలను ఏర్పాటు చేయటం అభినందనీయమని సినీహీరో బాలకృష్ణ, హీరోయిన్ మీనాక్షి చౌదరి అన్నారు. కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డులో మేనేజింగ్ డైరెక్టర్లు మణిదీప్ ఏచూరి, డాక్టర్ స్పందన ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన వారాహి సిల్క్స్‌ను శుక్రవారం ప్రారంభించారు. బాలకృష్ణను చూసేందుకు అభిమానులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. నటీ మీనాక్షి చౌదరి మాట్లాడుతూ.. దేశ సంస్కృతీ సంప్రదాయాల్లో చీర ప్రాముఖ్యత ఎంతో గొప్పది అని అన్నారు. రూ.15 వేలు అంతకంటే ఎక్కువ విలువైన కొనుగోళ్లపై 22 క్యారెట్ గోల్డ్ కాయిన్‌ను ఉచితంగా అందజేస్తున్నామని నిర్వాహకులు తెలిపారు.

విద్యార్థులకు ఉచితంగా సర్వైకల్ కేన్సర్ వ్యాక్సిన్



పేరు నమోదు చేసుకుంటున్న విద్యార్థినులు

ఆల్విన్‌కాలనీ: రాందేవ్‌రావు ఆసుపత్రి కార్నర్ స్టోన్ అనే సాఫ్ట్‌వేర్ సంస్థతో కలిసి శుక్రవారం రిక్షాపుల్లర్స్ కాలనీలోని ప్రభుత్వ పాఠశాలలో సుమారు 200 విద్యార్థినులకు ఉచితంగా సర్వైకల్ కేన్సర్ వ్యాక్సిన్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆసుపత్రి నిర్వాహకులు విక్రందేవ్ మాట్లాడుతూ.. నేటి బాలికలను ఆరోగ్యవంతంగా పెంచితే భవిష్యత్ తరాలు ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడుపుతాయన్నారు. పేషెంట్‌కి ప్రాణాపాయ స్థితిలో కృత్రిమంగా శ్వాసను అందించే వెంటిలేటర్ మానిటర్‌తో కలిసి రూ.24 లక్షలను కార్నర్ స్టోన్ సంస్థ ఆసుపత్రికి విరాళం ప్రకటించిందన్నారు. ఆసుపత్రి ఎండీ, డాక్టర్ కమలాకర్ మాట్లాడుతూ.. సర్వైకల్ కేన్సర్ వ్యాక్సిన్ ప్రోగ్రాంను ప్రతి బుధ, శనివారాలలో ఆసుపత్రిలో నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మీరారావు, సాఫ్ట్‌వేర్ నిర్వాహకులు అభిషేక్‌గుప్తా, డాక్టర్ ఛాయాదేవి తదితరులు పాల్గొన్నారు.